నిర్మానుష్య ప్రాంతంలో పసికందు

● కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలింపు


నిర్మానుష్య ప్రాంతంలో వదిలేసిన పసికందు

మియాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన ఓ పసికందు(పాప).. ఆదివారం మియాపూర్ మెట్రోస్టేషన్ సమీపంలోని చెరువు పక్కన నిర్మానుష్య ప్రాంతంలో గుక్కపెట్టి ఏడుస్తూ స్థానికుల కంటపడింది. వారు వెంటనే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పసికందును 108లో కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పసికందును ఎవరు వదిలి వెళ్లారనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చున్నీ మెడకు చుట్టుకుని బాలిక మృతి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చున్నీ మెడకు చుట్టుకొని ఊపిరాడకపోవడంతో ఓ చిన్నారి మృతిచెందింది. ఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవేంద్ర ఎరోనాటికల్స్ కాలనీలో నివాసముంటున్న గణేష్ ప్రైవేట్ ఉద్యోగి. ఇతనికి ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె మహాశ్రీ(10) చెల్లెలుతో కలిసి భవనం మూడో అంతస్తుపై ఆడుకుంటుంది. ఈ సమయంలో ప్రమాదవశాత్త మహాశ్రీ మెడకు చున్నీ చుట్టుకొని కిందపడిపోయింది. ఆమె చెల్లి వెంటనే ఇంట్లో ఉన్న తల్లికి విషయం చెప్పడంతో మహాశ్రీ మెడకు ఉన్న చున్నీని తొలగించి ఆస్పత్రికి తరలించంగా అప్పటికే బాలిక మృతిచెందిందని డాక్టర్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

డెలివరీ బాయ్ అదృశ్యం


సహీద్‌ఖాన్

బాలానగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న యువకుడు అదృశ్యమయ్యాడు. బాలానగర్ రాజూ కాలనీకి చెందిన శబ్బం, కాసీ దంపతుల కుమారుడు సహీద్ ఖాన్(20). ఈ నెల 12న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రయినా తిరిగి రాలేదు. మరుసటి రోజు తల్లి ఫోన్ చేయగా ఎత్తి తర్వాత ఫోన్ చేస్తానని పెట్టేశాడు. అప్పటి నుంచి అతడి సెల్ స్విచ్ఛాఫ్ ఉంది. ఎక్కడ వెతికినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో తల్లి బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది. సహీద్ ఖాన్‌ను ఎవరైనా గుర్తిస్తే ఫోన్ నం.9490617114కు సమాచారం ఇవ్వాలని సీఐ నవీన్‌కుమార్ సూచించారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ జాతర


శ్రీరేణుకాఎల్లమ్మ అమ్మవారు


ఆలయం వద్ద భక్తులు

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం శ్రీ రేణుకాఎల్లమ్మదేవి జాతరను తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల ఆటపాటలు, బోనాలతో వచ్చిన మహిళా భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. తెల్లవారుజాము నాలుగు గంటలకు రేణుకా ఎల్లమ్మ విశ్వరూప దర్శనం, 8గంటలకు అమ్మవారి కల్యాణం, మధ్యాహ్నం 3గంటలకు బండ్లు, బోనాలు ఊరేగింపు నిర్వహించారు. జాతరకు భక్తులతోపాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పోలీసులు గట్టి భద్రతా ఏర్పాటు చేశారు. జాతరలో ఆలయ కమిటీ చైర్మన్ ముత్యపాగ సహదేవ్, కార్యదర్శి పెరుమళ్ళ రవి, నర్సింగ్ రావు, తుపాకుల నర్సింగ్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే

● బండి రమేష్


చెరువులో మట్టిపోసి పూడుస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బండి రమేష్

అల్లాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెరువులు కబ్జాకాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీ నగర్ డివిజన్ ముళ్లకత్వ చెరువు నాలాను, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో మట్టితో పూడ్చి రేకుల షెడ్లు వేస్తున్న ప్రాంతాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ సర్వేయర్ శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువులు కబ్జాలకు గురై అన్యాక్రాంతమవుతున్నాయని, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, నాలాలను కబ్జాచేసి స్థిర నివాసాలు ఏర్పాటు చేయడంతో భూగర్భ జలాలు ఆవిరవుతున్నాయని అన్నారు. చెరువు స్థలంలోంచి కబ్జాకోరులను ఖాళీచేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూము సంతోష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గోపాల్‌రెడ్డి, చున్నూ బాయి, నయూమ్ మహ్మద్, సచిన్, మోసిన్, టింకూ, మహిళా నాయకులు పుష్పా రెడ్డి, కల్పన, రేశ్మ తదితరులు ఉన్నారు.

కులగణన తీర్మానంపై కాంగ్రెస్ నేతల హర్షం

బాలానగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదింప జేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, ఓబీసీ సెల్ చైర్మన్ తూము సంతోష్ ఆధ్వర్యంలో మూసాపేట్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, శివ చౌదరి, గోపాల్ రెడ్డి, రఘు, చున్నూ పాష, తూము వేణు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పుష్పారెడ్డి, సతీష్, కృష్ణ, రేష్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

'యూరప్ దేశాల్లో ఉన్నత విద్య ఖర్చు తక్కువ'

హైదర్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలతో పోల్చుకుంటే యూరోప్ దేశాలలో ఉన్నత విద్యకు తక్కువ ఖర్చు అవుతుందని ఫ్రాన్స్ క్యాంపస్ హైదరాబాద్ మేనేజర్ మెరీనా రాయిఖాన్ తెలిపారు. వారధి ఓవర్సీస్ ఆధ్వర్యంలో యూరోప్ ఎడ్యుకేషనల్ ఫెయిర్‌ను హైదర్‌నగర్ డివిజన్ పీఎన్ఆర్ ఎంపైర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెరీనా రాయిఖాన్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూరప్ దేశాల్లో 40కి పైగా యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొని విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆసక్తిగల విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వారధి ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఏనగర్ సమస్యల పరిష్కారానికి కృషి : జగదీశ్వర్‌గౌడ్


మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మియాపూర్ ఎంఏనగర్‌లో ఆయన స్థానికులతో కలిసి పర్యటించి సమస్యలు పరిశీలించారు. అనంతరం జగదీశ్వర్‌గౌడ్ స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఏనగర్‌లో ఇళ్ల పట్టాల సమస్య, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునందన్‌రెడ్డి, ఇలియస్‌షరీఫ్, వీరందర్‌గౌడ్, నల్ల సంజీవరెడ్డి, మన్నేపల్లి సాంబశివరావు, ప్రతాప్ రెడ్డి, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండుచోట్ల అధికారుల దాడి

అక్రమంగా విక్రయిస్తున్న మందులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ అధికారులు నగరంలో రెండు చోట్ల దాడిచేసి పెద్దమొత్తంలో నిల్వచేసిన మందులను స్వాధీనం చేసుకున్నారు. నాగోల్‌లో అక్రమంగా గోడౌన్ నిర్వహిస్తూ మందులు విక్రయిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారంతో అధికారులు శనివారం దాడి చేశారు. యాంటీబయాటిక్స్, పీడియాట్రిక్ సిరఫ్‌లు, యాంటీ-అల్సర్ మందులు, మల్టీవిటమిన్లు, మల్టీమినరల్ మొదలైన ఎనిమిది రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో శామీర్‌పేట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.బాల నాగంజన్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు బి. లక్ష్మీనారాయణ, బి. ప్రవీణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్‌లో శ్రీ బ్లూటెన్ ఫార్మసీపై అధికారులు దాడి చేసి ఫుడ్ లైసెన్స్‌తో మల్టీ విటమిన్ క్యాప్సుల్స్ అక్రమంగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఆహార ఉత్పత్తి, న్యూట్రాస్యూటికల్స్ పేరుతో మలక్‌పేట్‌లో యాక్సెనిక్ హెల్త్‌కేర్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఉత్పత్తులు నకిలీవని అధికారులు వెల్లడించారు. దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. విజయ్‌గోపాల్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు తిరుపతి, కె. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జీడిమెట్ల గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తా'

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల గ్రామంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి ఆదివారం పర్యటించారు. స్థానికంగా నెలకొన్న మురుగు నీటి, రోడ్డు సమస్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పనులు పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డి.కుమారస్వామి, షైపాల్‌రెడ్డి, యశ్వంత్, అరవింద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గైనకాలజీ సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. మెడికవర్, ఆహా క్లినిక్స్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ అవకాశం 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని, ప్రతిరోజూ సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకు, ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గచ్చిబౌలి మెయిన్‌రోడ్డులోని టెలీకాంనగర్‌లోని ఆహా క్లినిక్‌లలో వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు.

తులసీనగర్ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

హైదర్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ తులసీనగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా(మూడోసారి) చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సీహెచ్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా సిద్ధారెడ్డి, ట్రెజరర్‌గా శంకర్‌రావును ఎన్నుకున్నారు.


తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సిరిసిల్ల రాజయ్యను, ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా నియమితులైన రమేష్, సుధీర్‌రెడ్డిలను కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఆదివారం కలిశారు. ముగ్గురిని శాలువా, పూలమాలలతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, తూము వేణు తదితరులు ఉన్నారు.

- బాలానగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి)

మెట్రో ఫేస్ -2లో మేడ్చల్‌ను చేర్చాలి

● అంబేడ్కర్ విగ్రహం వద్ద డిమాండ్

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మెట్రో ఫేస్ -2 ప్లాన్‌లో మేడ్చల్‌ను చేర్చాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సుచిత్రా, బోయినపల్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ మేడ్చల్, కొంపల్లి, అల్వాల్, తూముకుంట, బొల్లారం, తదితర ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకు అనుగుణంగా రెండోదశ మెట్రో ప్రణాళికల్లో మేడ్చల్‌ను చేర్చి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు మహేందర్ రెడ్డి, గిరిధర్, సంపత్‌రెడ్డి, రాజేష్, జార్జ్ పాల్గొన్నారు.


సూరారం రాజీవ్‌గాంధీనగర్‌లోని అంబేద్కర్ భవన సముదాయంలో ఆదివారం బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్‌రెడ్డి, దళిత సంఘం కమిటీ నాయకులు అడ్వైజర్ యాదగిరి, చైర్మన్ అశోక్, సభ్యులు మేకల బాలరాజు, సమ్మయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

- షాపూర్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి)



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ తుకారం, ఐజీపీ రమేష్‌రెడ్డి, డీసీపీ వినీత్, రన్‌లో పాల్గొన్న యువత

హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ 10కే, 21కే రన్

రాయదుర్గం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ వార్షిక ఈవెంట్-2024 హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆదివారం జరిగింది. 10కే, 21కే రన్ నిర్వహించారు. రన్‌లో రెండువేల మంది పాల్గొన్నారు. హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ పి.తుకారం, ఐజీపీ రమేష్‌రెడ్డి, డీసీపీ వినీత్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్ అందజేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో ఫిట్‌నెస్ కార్యకలాపాల ప్రాధాన్యం తెలియజేయడం ఈ రన్ ఉద్దేశమన్నారు.

జగద్గిరిగుట్ట నుంచి మేడారానికి స్పెషల్ బస్సులు

ఫతేనగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం ఇసాక్, డిపో సీఐ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. జగద్గిరిగుట్ట బస్టాపు నుంచి సోమవారం ఉదయం 5 గంటల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మొత్తం 19 బస్సులను జాతర కోసం అందుబాటులో ఉంచినట్లు వారు వివరించారు. జాతర స్పెషల్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునని పేర్కొన్నారు.